

సివిల్స్ / గ్రూప్- 1, 2 - జేఎల్ / డీఎల్ గైడెన్స్

## జనరల్ స్టడీస్ - పాలిటీ

# పాలిటీ మేడ్ ఈజీ




బి. కృష్ణారెడ్డి
bkreddygongati@gmail.com
Ph:9959361278


రెండు వారాలుగా నిబంధనలు, షెడ్యూళ్లు, జీతభత్యాలపై కొన్ని మెలకువలు అందించాం. అలాంటి మరికొన్ని అంశాలను పరిశీలిద్దాం.

రాజ్యాంగంలో ఉన్న భాగాల్లోని అంశాలకు సంబంధించినవి.

| భాగం | అంశం |
|---|---|
| I | కేంద్రం - రాష్ట్రాలు - భూభాగాలు |
| II | పౌరసత్వం |
| III | ప్రాథమిక హక్కులు |
| IV | ఆదేశిక నియమాలు |
| V | కేంద్రప్రభుత్వం |
| VI | రాష్ట్ర ప్రభుత్వాలు |
| VIII | కేంద్రపాలిత ప్రాంతాలు (గమనిక: 7వ భాగాన్ని తొలగించారు) |
| IX | పంచాయతీల నిర్మాణం |
| IXA | మున్సిపాలిటీల నిర్మాణం |
| XI | కేంద్ర-రాష్ట్రాల మధ్య శాసన, పరిపాలనా సంబంధాలు |
| XII } | వ్యాపార, వాణిజ్య సంబంధాలు. |
| XIII } | ఆర్థిక సంబంధాలు |
| XIV | కేంద్ర-రాష్ట్ర సర్వీసులు |
| XIVA | పరిపాలన ట్రిబ్యునల్స్ |
| XV | ఎన్నికలు - ఎన్నికల సంఘం |
| XVI | ఎస్సీ, ఎస్టీ, బిసి, ఆంగ్లో ఇండియన్లకు ప్రత్యేక రక్షణలు - ప్రాతినిధ్యం |
| XVII | అధికార భాషలు |
| XVIII | అత్యవసర అధికారాలు |
| XIX | కొన్ని మినహాయింపులు (పరీక్ష రీత్యా అవసరం లేదు) |
| XX | రాజ్యాంగ సవరణ విధానం |
| XXI | తాత్కాలిక, ప్రత్యేక రక్షణలు (జమ్మూకాశ్మీర్, ఆంధ్రప్రదేశ్, నాగాలాండ్ మొదలైన రాష్ట్రాలకు) |
| XXII | టైటిల్, హిందీలో సాధికార రాజ్యాంగ తర్జుమా |

పై అంశాలను రెండు లేదా మూడు పర్యాయాలు చదివి ఆకళింపు చేసుకున్న తరవాత తార్కిక కనెక్టింగ్ లైన్ ఏర్పర్చుకోవాలి. అది ఎలాగో చూద్దాం.

I దేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలున్నాయి. అందులో పౌరులు ఉంటారు. వారికి
II 'పౌరసత్వం' ఉంటుంది
III పౌరులకు ప్రాథమిక హక్కులు ఉంటాయి
IV హక్కులతోపాటు అవకాశాలు ఉంటాయి. అనగా (నిర్దేశిక నియమాలు)
IVA హక్కులు, అవకాశాలతోపాటు విధులు కూడా ఉండాలిగా మరి.
V వీటిని 'కేంద్రప్రభుత్వం' (కేంద్ర)
VI రాష్ట్ర ప్రభుత్వాలు (రాష్ట్రాలు)
VIII కేంద్రపాలిత ప్రాంతాలు. (కేంద్రపాలిత)
IX 'స్థానిక పంచాయతీలు' (పంచాయతీ)
IXA మున్సిపాలిటీలు అమలు చేయాలి. (మున్సిపాలిటీ)
XI వాటి మధ్య సంబంధాలు (కేంద్ర-రాష్ట్ర సంబంధాలు) బాగుండాలంటే
XII 'ఆర్థిక, ఆస్తి విషయాల్లో' వివాదాలుండరాదు. అప్పుడే
XIII 'వాణిజ్య, వ్యాపార సంబంధాలు' గట్టిపడతాయి. అందుకోసం
XIV కేంద్ర-రాష్ట్ర సివిల్ సర్వీసులు ఏర్పాటు చేశారు (యుపిఎస్సి, ఎస్‌పిఎస్సి మొదలైనవి). అంతేకాదు ఈ సర్వీసు వివాదాలను పరిష్కరించేందుకు
XIVA 'పరిపాలనా ట్రిబ్యునల్స్' ఏర్పాటు ఆ తరవాత ఎన్నికలు ఉండాలి కదా
XV 'కేంద్ర ఎన్నికల సంఘం' ఈ ఎన్నికల్లో
XVI ఎస్సీ, ఎస్టీ, ఓబిసి, ఆంగ్లో ఇండియన్లకు ప్రత్యేక సదుపాయాలు.
వాటిని అందరికీ అర్థమయ్యేలా చెప్పేందుకు
XVII 'అధికార భాషలు' ఉన్నాయి. ఒకవేళ వీటిమధ్య గొడవలు, ఘర్షణ చెలరేగి దేశ ఐక్యతకు ప్రమాదంగా మారితే
XVIII 'అత్యవసర అధికారాల'ను రాష్ట్రం ఉపయోగించే ఏర్పాటు కూడా ఉంది మరి.
వాటికి
XIX 'కొన్ని మినహాయింపుల'తో అవసరమైతే
XX 'రాజ్యాంగాన్ని సవరించు'కొనేందుకు ఒక పద్ధతి కూడా నిర్దేశించారు.
XXI ఇందులో కొన్ని రాష్ట్రాలకు తాత్కాలిక ప్రత్యేక ఏర్పాట్లు చేశారు
XXII హిందీలోకి రాజ్యాంగాన్ని అధికారికంగా తర్జుమా చేశారు కూడా.

**సూచన:** రాజ్యాంగ భాగాలకు, షెడ్యూళ్ల మధ్య తేడాను అభ్యర్థులు గమనించాలి.

**'భాగాలు'** అనేవి అవగాహన సౌలభ్యం కోసం వర్గీకరించిన ప్రత్యేక శీర్షికలు. రాజ్యాంగంలోని 395 నిబంధనలను 'XXII' భాగాలుగా విడగొట్టారు. కాబట్టి 'పార్ట్' అనేది పార్టిషన్ ఆఫ్ 'ఆర్టికల్స్' అని చెప్పవచ్చు.

**'షెడ్యూల్'** అంటే అనుబంధం. నిబంధనలకు అవసరమైన వివరణ, అదనపు సమాచారాన్ని దీనిలో పొందుపరుస్తారు. ఇవి రాజ్యాంగం చివరిలో ఉంటాయి.

## వివరాలు ఇవిగో

### మోడల్ కావాలంటే ఏ లక్షణాలుండాలి?

❍ **నేను మోడలింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలనుకుంటున్నాను. నా ఎత్తు 5.7. మోడల్ కావాలంటే ఏ లక్షణాలు ఉండాలి?**

**-హర్షిత, హైదరాబాద్**

✎ మోడలింగ్‌లోకి వెళ్లాలంటే ఎత్తు 5.10 ఉంటే మంచిది. ఫ్యాషన్ మోడలింగ్ ముఖ్యంగా మూడు రకాలు. ఒకటి ప్రింట్, అడ్వర్టయిజ్‌మెంట్, కేటలాగ్స్ కోసం స్టిల్ మోడలింగ్, రెండు టెలివిజన్, ఇతర పెద్ద కమర్షియల్స్ కోసం ఆడియో విజువల్ మోడలింగ్, మూడు ఫ్యాషన్ షోల కోసం రాంప్ మోడలింగ్. శారీరక ప్రమాణాల్లో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ గడ గడ మాట్లాడగలిగితే మొదటి రెండు రంగాలు ట్రై చేసుకోవచ్చు. మోడలింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుంటే మాత్రం ఆహారం, ఇతర విషయాల్లో క్రమం తప్పకుండా ప్రమాణాలు పాటించాలి. చక్కటి శరీరాకృతి, ముఖవర్చస్సు ఒక్కరోజులో సాధ్యం కావు. వీటితోపాటు ఫ్యాషన్‌లో వస్తున్న లేటెస్ట్ ట్రెండ్స్‌ను గమనించండి.



మీ ప్రయత్నాల్లో భాగంగా ఫుల్ లెన్త్, క్లోజ్‌అప్ కలర్ ఫోటోలు, మీ శరీర కొలతల వివరాలను మోడలింగ్ ఏజెన్సీలకు పంపండి. అందుకోసం ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌ల దగ్గర ఫొటోలు తీయించుకోండి. అలాగే ఫ్యాషన్ మేగజైన్స్, అడ్వర్టయిజ్‌మెంట్ ఏజెన్సీలతో నేరుగా లేదా ఇ-మెయిల్ లేదా ఫోన్ ద్వారా పరిచయాలు పెంచుకోవడానికి ప్రయత్నించండి. పేరున్న మోడలింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో చేరితే పని మరికొంచెం సులువు అవుతుంది.

### ప్రభుత్వ ఉద్యోగానికి అర్హులేనా?

❍ **దూరవిద్య ద్వారా మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ చేయాలనుకుంటున్నాను. ఈ కోర్సు చేసినవారు ప్రభుత్వ ఉద్యోగానికి అర్హులేనా?**

**-కె.కిరణ్ కుమార్, రాజమండ్రి**

✎ ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్‌లో నాలుగు సంవత్సరాల బిటెక్ కోర్సును అందిస్తోంది. డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్ లేదా అడ్వాన్స్‌డ్ డిప్లొమా లేదా డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మ్యానుఫ్యాక్చరింగ్ చేసినవారు ఈ కోర్సులో చేరడానికి అర్హులు. బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ఇందులో చేరవచ్చు. మెకానికల్ డిగ్రీ లేదా డిప్లొమాలు అవసరం ఉన్న కేంద్ర, రాష్ట్రస్థాయి సంస్థల్లో పనిచేయవచ్చు. ఈ కోర్సుకు సంబంధించిన వివరాల కోసం www. ignou.ac.in వెబ్‌సైట్ చూడవచ్చు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ (www.nagarjunauniversity.ac.in), పాటియాలాలోని థాపర్ యూనివర్సిటీ (www.tiet.ac.in)లు కూడా ఈ రకమైన కోర్సులు అందిస్తున్నాయి. డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు కూడా ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులు.

### మేనేజ్‌మెంట్ సంస్థల వివరాలు..

❍ **నేను బికాం ఫైనలియర్ చదువుతున్నాను. తరవాత మేనేజ్‌మెంట్ చదవవాలనుకుంటున్నాను. మన దగ్గర ఉన్న మంచి మేనేజ్‌మెంట్ సంస్థల గురించి తెలపండి?**

**- కుమార్, అనంతపురం**

✎ మన పట్టణంలోనే లేదా మన రాష్ట్రంలోనే చదువుతా అనే నియమం పెట్టుకోకండి. మంచిది కావాలంటే ఎక్కడికైనా వెళ్లాల్సిందే. ఉద్యోగం కూడా మన ఊర్లోనే రావాలంటే రాదు కదా. అలాగే చదువుకూడా మన దగ్గర ఉండాలటే కుదరదు. అలా అని మనదగ్గర మంచి బిజినెస్ స్కూల్స్ లేవు అని చెప్పడం లేదు. ఐఎస్‌బి లాంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థలు మన దగ్గర కూడా ఉన్నాయి. దేశంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ల్లో అడ్మిషన్స్ కోసం కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్) నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలో మేనేజ్‌మెంట్ సంస్థల్లో అడ్మిషన్ కావాలంటే ఐసెట్ (ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) రాయాలి. వీటిలో మెరిట్ అధారంగా కాలేజీల్లో అడ్మిషన్ ఉంటుంది.

చిరునామా: **వివరాలు ఇవిగో,** కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్విని ఎన్‌క్లేవ్, హుడాహైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033

# మేనేజ్‌మెంట్ కోర్సుల్లో మార్కెట్ ట్రెండ్ ముఖ్యం

**- ప్రొఫెసర్ ఆర్‌కె మిశ్రా, ఐపిఇ డైరెక్టర్**



*ఒక సంస్థ సమర్థంగా పనిచేయాలంటే మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు ఎంతో అవసరం. బ్యాంకింగ్, పరిశ్రమలు, తదితతర రంగాల్లో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు మంచి వేతనాలతో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఇలాంటి పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్(ఐపిఇ) విద్యార్థులకు ఉపాధిని అందించే ఎన్నో కొత్త కోర్సులను ఎప్పటికప్పుడు అందుబాటులోకి తీసుకువస్తోంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈ సంస్థ ఉంది. బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులకు ఉన్న భవిష్యత్తు అలాగే వీటిని చేస్తున్న విద్యార్థులకు ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ మిశ్రా చెప్పిన వివరాలు...*

❍ **ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక మాంద్యంలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరిస్థితి ఎలా ఉంది..?**

✎ బిజినెస్‌మెంట్ కోర్సుల అవసరం అన్ని పరిస్థితుల్లో ఉంటుంది. ఏ పరిశ్రమ అయినా, ఎలాంటి సంస్థ అయినా సమర్థంగా పనిచేయాలంటే అడ్మినిస్ట్రేటివ్ నైపుణ్యం కలిగిన వ్యక్తుల అవసరం అనివార్యం. అలాగే బిజినెస్ మేనేజ్‌మెంట్ రంగంలో ఎన్నో కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి.

❍ **బిజినెస్‌మేనేజ్‌మెంట్‌తో పాటు ఎలాంటి కోర్సులు మీ సంస్థలో అందుబాటులో ఉన్నాయి? అడ్మిషన్ పక్రియ, కోర్సుల ప్రాధాన్యం ఏమిటి ?**

✎ ప్రస్తుతం ఐపిఇలో మేనేజ్‌మెంట్‌లో పిజి డిప్లొమా, పిజి డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ రిటెయిల్ మార్కెటింగ్, పిజి డిప్లొమా ఇన్‌బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, పిజి డిప్లొమా ఇన్ ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సులను అందిస్తున్నాం. వీటిలో చేరేందుకు గాను క్యాట్ లేదా మ్యాట్ పరీక్షలో ర్యాంక్ సాధించి ఉండాలి. ప్రత్యేక ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్లు కల్పిస్తాం. ఒక్కో కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన విద్యార్థులకు థియరీతో పాటు ప్రాక్టికల్స్ ఉంటాయి. వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థల్లో ప్రాక్టికల్ శిక్షణ కోర్సులో భాగం.

❍ **కార్పొరేట్ రంగంతో ఎక్కువగా అనుబంధం కలిగి ఉన్న మేనేజ్‌మెంట్ కోర్సులు గ్రామీణ మార్కెటింగ్‌లో ఎలా దోహదపడతాయి..?**

✎ ప్రపంచీకరణ నేపథ్యంలో నేడు గ్రామీణ మార్కెటింగ్‌కు ప్రాముఖ్యం ఏర్పడింది. ప్రాక్టికల్స్‌లో భాగంగా విద్యార్థులను గ్రామీణ ప్రాంతాలకు తీసుకు వెళ్లి వారికి అవగాహన కలిగిస్తున్నాం. తద్వారా ఏ ప్రాడక్టులను ఎలా విక్రయించాలి, ఏ వస్తువు ఎలాంటి వ్యక్తులకు అవసరమనే విషయాలను విద్యార్థులు నేర్చుకుంటున్నారు. గ్రామీణ రంగంవైపు మొగ్గు చూపే యువతకు ఆ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతోంది.

❍ **కొత్తగా ప్రవేశపెట్టిన రిటైల్ మార్కెటింగ్‌పై వివరించండి...?**

✎ ప్రస్తుతం మా సంస్థ ద్వారా రిటెయిల్ మార్కెటింగ్‌పై ప్రవేశపెట్టిన కోర్సుకు మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఈ-మార్కెటింగ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కోర్సును రూపొందించాం. రిటైల్ మార్కెంటింగ్ చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కూడా అధికమే.

❍ **ఈ మధ్య ఎక్కువగా వాడుకలోకి వచ్చిన పదం 'సామాజిక బాధ్యత'. ఈ విషయంలో మీరు తీసుకుంటున్న చర్యలు.... ?**

✎ సామాజిక బాధ్యత అనగానే చదువుతోపాటు ఇతరులకు ఏదో ఒక రకమైన సేవ చేయాలనే దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం. అందు కోసం ఇక్కడ ప్రతి ఏటా రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు ఏర్పాటుచేసి విద్యార్థులను అందులో భాగస్వాములను చేస్తున్నాం. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కలిగిస్తున్నాం. ఇక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గో గ్రీన్ యూనిట్‌లో విద్యార్థులను భాగస్వాములు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పచ్చదనాన్ని పెంపొందిస్తున్నాం. కొన్ని గ్రామాలను దత్తతగా తీసుకుని అక్కడి పేద ప్రజలకు చదువు నేర్పించాం. ఇలాంటివాటితో సమాజానికి మన వంతు సాయం అందించాలనే దృక్పథం విద్యార్థుల్లో కలుగుతుందని భావిస్తున్నాం.

❍ **సిలబస్ ఎలా రూపొందిస్తారు....? మార్పులు ఏ విధంగా ఉంటాయి...?**

✎ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనుమతితో మా కోర్సులన్నింటినీ నిర్వహిస్తున్నాం. అయితే సిలబస్ రూపకల్పనలో మాత్రం సంస్థదే తుది నిర్ణయం. ఏటా సిలబస్‌లో మార్పులు జరుగుతుంటాయి. అయితే మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగానే ఇవి ఉంటాయి.

❍ **కోర్సు పూర్తి చేసిన వారికి ఎలాంటి ఉపాధి అవకాశాలు ఉన్నాయి? ఇప్పటి వరకు ఏయే సంస్థల్లో విద్యార్థులు ఉద్యోగాలు పొందారు....?**

✎ కోర్సులు పూర్తి చేసిన వారికి పరిశ్రమలు, కార్పొరేట్ రంగంలో మంచి అవకాశాలు లభిస్తున్నాయి. కొందరు సొంతంగా పరిశ్రమలు స్థాపించి మరికొంత మందికి ఉపాధిని కల్పిస్తున్నారు. నిరంతరం పబ్లిక్ సెక్టార్‌ను సమీక్షించడానికి తోడు పరిశ్రమల్లో ఉత్పాదన శక్తిని మెరుగుపరిచేందుకు వివిధ కన్సల్టెన్సీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాం. దీని వల్ల మా విద్యార్థులకు ఉపాధి అవకాశాలే కాదు, పరిశ్రమలతో మాకు అనుబంధం ఏర్పడింది. ఫలితంగా మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా కోర్సులను తీర్చిదిద్దే అవకాశాలు మెరుగుపడుతున్నాయి.

❍ **కొత్తగా ఏమైనా కోర్సులు ప్రవేశపెడుతున్నారా..?**

✎ కొత్తగా ఎగ్జిక్యూటివ్ ఎంబిఎ అనే కోర్సును ప్రవేశపెడుతున్నాం. రెగ్యులర్ కోర్సుతో పాటు సాయంకాలం కోర్సును కూడా నిర్వహించనున్నాం. ఈ డిసెంబరులో ప్రవేశాలు జరుగుతాయి. ఈ కోర్సుపై విదేశీ విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఇవే కాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

**- రేగుంట వెంకటేష్, తార్నాక జోన్ ప్రతినిధి, హైదరాబాద్**

## ఎస్సీ-ఎస్టీ, బీసీ అభ్యర్థులకు గ్రూప్ 1 ఉచిత శిక్షణ

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు వెనుకబడిన తరగతుల శాఖ ఉచిత శిక్షణ ఇవ్వనుంది. రాష్ట్రంలోని ఎనిమిది ప్రాంతాల్లో శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఒక్కో సెంటర్లో అరవై సీట్లు ఉన్నాయి. మూడు సంవత్సరాలు అంటే 2005 నుంచి 2009 వరకు డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. అలాగే గ్రూప్ 1 ప్రిలిమినరీకి మొదటిసారి హాజరవుతూ ఉండాలి. టెన్త్ నుంచి పొందిన మార్కులు, అలాగే స్టడీ సెంటర్లో నిర్వహించే పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు.
అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.లక్ష కంటే తక్కువ ఉండాలి. అసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబర్ 15 లోగా పంపుకోవాలి.

**స్టడీ సెంటర్లు - ఫోన్ నంబర్లు**

1. హైదరాబాద్ (040-24651178)
2. మహబూబ్‌నగర్ (08542-245790)
3. వరంగల్ (0870-2571192)
4. అనంతపురం (08554-275575)
5. గుంటూరు (0863-2358071)
6. విశాఖపట్నం (0891-2564346)
7. కర్నూలు (08518-236076)
8. రాజమండ్రి (0883-2421129)

మరిన్ని వివరాలకు అక్టోబర్ 22 నాటి ప్రముఖ దినపత్రికలు చూడవచ్చు.

## గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్‌లో..

నేషనల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) కెనడాలోని కామన్‌వెల్త్ ఆఫ్ లెర్నింగ్‌తో కలిసి గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్‌లో ఇంటర్నేషనల్ డిప్లొమా కోర్సును నిర్వహిస్తోంది. టీచర్లు, టీచర్ ఎడ్యుకేటర్లు, శిక్షణ పొందని గైడెన్స్ సిబ్బంది తదితరులు ఈ కోర్సులో చేరవచ్చు. ప్రస్తుతం న్యూఢిల్లీ, ఆజ్మీర్, భోపాల్, భువనేశ్వర్, మైసూర్ షిల్లాంగ్‌లలో స్టడీ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో సెంటర్లో 50 సీట్లు ఉన్నాయి. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ 20లోగా పంపుకోవాలి. మరిన్ని వివరాలకు వెబ్ సైట్ చూసుకోవచ్చు. వెబ్‌సైట్: www.ncert.nic.in



## గ్రూప్- 1స్క్రీనింగ్ టెస్ట్

### భారత ఆర్థిక వ్యవస్థ

# విత్తరంగ సంస్కరణలు




డాక్టర్ టి.సాయిలు


ప్రభుత్వ ఆదాయ, వ్యయాలకు సంబంధించి అనుసరిస్తున్న విధానాన్ని విత్త విధానం అంటారు. 1991 నుంచి విత్త విధానంపై భారతప్రభుత్వం అనుసరిస్తున్న నూతన వైఖరిని విత్తవిధాన సంస్కరణలు లేదా విత్తరంగ సంస్కరణలు అంటున్నారు.

ప్రభుత్వం తన వ్యయాన్ని సాధ్యమైనంత నియంత్రణలో ఉంచుతూ ప్రభుత్వ ఆదాయ మార్గాలను మరింత పటిష్ఠం చేసుకోవడం, విస్తృతం చేసుకోవడం ఈ నూతన విత్త విధానంలో భాగం.

అభివృద్ధియేతర ఖర్చును తగ్గించడం, పాలనా సిబ్బందిని తగ్గించడం (డౌన్ సైజింగ్/రైట్ సైజింగ్ గవర్నమెంట్) మొదలైన చర్యల ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రణలో ఉంచాలనేది ప్రభుత్వ విధానం. ప్రభుత్వ వ్యయ సంస్కరణల కోసం నియమించిన గీతాక్రిష్ణన్ కమిషన్ పాలనా సిబ్బందిని భారీగా తగ్గించాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను ఆమోదించిన ప్రభుత్వం ప్రతి సంవత్సరం 5 శాతం చొప్పున సిబ్బందిని తగ్గించాలని 2001లో నిర్ణయించింది. 2011 నాటికి మొత్తం 50 శాతం సిబ్బందిని తగ్గించడం ప్రభుత్వ లక్ష్యం.

ప్రభుత్వరంగ సంస్థల పట్ల ప్రభుత్వం తన విధానం మార్చుకొని వ్యయాన్ని నియంత్రించుకుంది. అలాగే ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ జరపడం ద్వారా నిధులను కూడా సమకూర్చుకుంది.

సబ్సిడీలను తగ్గించడం కోసం రాష్ట్ర ప్రభుత్వాలను విద్యుత్ సంస్కరణలు జరపాలని కోరింది. 1998 సంవత్సరంలో విద్యుత్ నియంత్రణ కమిషన్ చట్టం చేసి ఈ చట్టం పరిధిలో విద్యుత్ నియంత్రణ కమిషన్‌లను వేశారు. భారత విద్యుత్ చట్టం 1910, విద్యుత్ సరఫరా చట్టం 1948, విద్యుత్ నియంత్రణ కమిషన్ చట్టం 1998ల స్థానంలో విద్యుత్ చట్టం 2003ను చేశారు. ఈ చట్టం విద్యుత్ రంగ సంస్కరణలకు అవసరమైన విధి విధానాలను అందించింది. దీని పరిధిలోనే రాష్ట్రాలలో విద్యుత్ సంస్కరణలను అమలుపరిచారు.

రాష్ట్రాల విద్యుత్ బోర్డులు ఎదుర్కొంటున్న నష్టాలను నివారించి రాష్ట్రాల ఆర్థిక స్థితిని మెరుగుపర్చడం విద్యుత్ సంస్కరణల లక్ష్యం. ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించే క్రమంలో భాగంగానే 1997లో సబ్సిడీలపై చర్చా పత్రం ప్రకటించారు. 1997లోనే ప్రజాపంపిణీ వ్యవస్థను లక్షిత ప్రజాపంపిణీ వ్యవస్థగా మార్చారు (పేదలందరికి కాకుండా లక్షిత నిరుపేదలకు ఈ పథకం వర్తించేలా చేశారు). వ్యయ నియంత్రణలో భాగంగా 1999లో కేంద్ర ప్రభుత్వం 'జీరో ఆధారిత బడ్జెట్'ను ప్రవేశపెట్టింది. జీరో ఆధారిత బడ్జెట్ విధానంలో ప్రతి శాఖకు కేటాయింపులు నూతనంగా అంచనా వేస్తారన్నమాట. అంతకుముందు కేటాయింపులకు అదనంగా జోడించి కేటాయించే విధానం ఉండదు. విత్త సంస్కరణల్లో శిఖరాగ్ర చర్యగా విత్త జవాబుదారీ, బడ్జెట్ నిర్వహణ చట్టం 2003ను పేర్కొనాలి. ఈ చట్టం వ్యయాన్ని అదుపు చేస్తూ ఆదాయాన్ని పెంచుకుంటూ తమ రెవిన్యూ లోటు, విత్త లోటులను తగ్గించాలని ప్రభుత్వాలను ఆదేశిస్తుంది. ఈ చట్టం 2008 మార్చి 31 నాటికి రెవిన్యూ లోటును శూన్యం చేయాలనీ, విత్తలోటును 3 శాతానికి పరిమితం చేయాలని నిర్దేశించింది.

ఆదాయ వనరులను పెంచుకోవడంలో భాగంగా 1991లో డాక్టర్ రాజా చెల్లయ్య ఆధ్వర్యంలో పన్నుల సంస్కరణల కమిటీని నియమించారు. 1992లో ఈ కమిటీ నివేదికను అందచేసింది. ఈ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా తీసుకున్న అనేక చర్యలలో భాగంగా 1994-95 నుంచి సర్వీసులపై పన్ను విధించడం ఆరంభించారు. 1992లో పరోక్ష పన్నులపై ఎం.ఎల్.రేఖీ కమిటీని నియమించారు. 2002లో ప్రత్యక్ష పన్నులపై విజయ్ కెల్కర్ కమిటీని వేశారు.

పన్నుల మినహాయింపు పొందే వ్యక్తి ఆదాయ వార్షిక పరిమితిని పెంచాలని విజయ్ కేల్కర్ కమిటీ సిఫార్సు చేసింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా తీసుకున్న చర్యల్లో పన్ను మినహాయింపును పొందే ఆదాయ పరిమితిని పెంచడంతోపాటు పన్ను శాతాన్ని తగ్గించారు. రాష్ట్రాల్లో పన్నుల సంస్కరణల్లో భాగంగా సాధారణ అమ్మకం పన్ను స్థానంలో 2005 నుంచి విలువ ఆధారిత పన్నును (వ్యాట్) ప్రవేశపెట్టారు. విలువ ఆధారిత పన్ను ద్వారా పన్ను ఎగ్గొట్టడం తగ్గి వసూళ్లు పెరుతాయనేది భావన.

ఇలా వ్యయాన్ని నియంత్రించే చర్యలు, ఆదాయ వనరుల సమీకరణకు తీసుకున్న చర్యల్లో భాగంగా 1990-91లో 3.3 శాతం ఉన్న రెవిన్యూ లోటు 2007-08 నాటికి 1.5 శాతానికి తగ్గింది. విత్త లోటు 1990-91 లో 6.6 శాతం ఉండగా 2007-08నాటికి 3.2 శాతానికి తగ్గింది.

### ద్రవ్యరంగ సంస్కరణలు

మార్కెట్‌లో ద్రవ్య సరఫరా ఎంత ఉండాలి, ద్రవ్య సంస్థలు ఏ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి అనే విధాన నిర్ణయాన్ని ద్రవ్య విధానం అంటారు. 1991 నుంచి ద్రవ్య విధానంలో వచ్చిన మార్పులను ద్రవ్యరంగ సంస్కరణలు అంటున్నారు. ద్రవ్యరంగ సంస్కరణల నిమిత్తం ఎం.నరసింహం కమిటీ 1991లో ఒకసారి 1998లో రెండోసారి తన సిఫార్సులు చేసింది.

చట్టబద్ధ ద్రవ్యత్వరాశి (ఎస్‌ఎల్‌ఆర్)ని, బ్యాంకురేటును, నగదు నిల్వల నిష్పత్తిని తగ్గించడం మొదలైన చర్యలు ద్రవ్యరంగ సంస్కరణల్లో భాగం. పై వాటిని తగ్గించడమంటే రుణమివ్వగలిగే నిధుల పరిమాణాన్ని బ్యాంకుల దగ్గర ఎక్కువగా ఉంచుకొనే అవకాశాన్ని కల్పించడం. ఆర్థిక సరళీకరణలో భాగంగా ప్రైవేటు రంగానికి ఆర్థిక వ్యవస్థలో పెద్దపీట వేశారు. ఆ క్రమంలో ప్రైవేటు రంగానికి సులభంగా పరపతి సౌకర్యం అందేందుకు పై చర్యలు తీసుకున్నారు. ప్రైవేటు బ్యాంకులకు అనుమతి, బ్యాంకుల బ్రాంచ్‌ల అనుమతిలో సరళీకరణ, బ్యాంకింగ్ రంగంలోని విదేశీ పెట్టుబడి అనుమతి, మొండి బకాయిల వసూళ్లకు ఆస్తుల పునర్నిర్మాణ సంస్థలను ఏర్పాటుచేయడం మొదలైనవాటి ద్రవ్యరంగ సంస్కరణల్లో భాగం.

అయితే ద్రవ్యరంగ సంస్కరణల విషయంలో అనుసరించాల్సిన ఆర్థిక సరళీకరణలో ప్రభుత్వం వేగాన్ని కోరుకున్నప్పటికీ ద్రవ్య, పరపతి విధానం భారతీయ రిజర్వు బ్యాంకు చేతిలో ఉంది. దానివల్ల ఆర్‌బిఐ కొంత జాగరూకతతో ఆచితూచి చర్యలు తీసుకుంది. ఆర్‌బిఐ పాటించిన ఆ సంయమనమే భారతదేశాన్ని ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక మాంద్యాన్ని తట్టుకొని నిలబడేలా చేసింది.

**బ్యాంకు రేటు:**
భారతీయ రిజర్వుబ్యాంకు ఇతర బ్యాంకులకు ఇచ్చే రుణాలపై విధించే వడ్డీరేటు. ద్రవ్యరంగ సంస్కరణల్లో భాగంగా బ్యాంకురేటును క్రమంగా 8 శాతం నుంచి 6 శాతానికి తగ్గించారు.

**నగదు నిల్వల నిష్పత్తి:**
వాణిజ్య బ్యాంకులు తమ డిపాజిట్‌ల నుంచి భారతీయ రిజర్వుబ్యాంకు దగ్గర నిల్వగా ఉంచే కనీస నిష్పత్తి. నగదు నిల్వల నిష్పత్తిని 15 శాతం నుంచి క్రమంగా 6 శాతానికి తగ్గించారు.

**చట్టబద్ధ ద్రవ్యత్వరాశి:**
వాణిజ్య బ్యాంకులు తమ డిపాజిట్లలో నగదుగా తమ దగ్గర నిల్వ ఉంచుకోవాల్సిన నిష్పత్తిని చట్టబద్ధ ద్రవ్యత్వరాశి అంటారు. 1991లో 38.5 శాతంగా ఉండగా 1997 నాటికి 25 శాతానికి తగ్గించారు. 25 శాతం కనీసం ఉంచాల్సిన నిష్పత్తి.

**నష్టభయ ఆస్తుల్లో మూలధన నిష్పత్తి:**
1992లో కనీసం 8 శాతం నష్టభయ ఆస్తులకు మూలధన నిష్పత్తి ఉండాలని నిర్ణయించారు. తరవాత దీనిని 9 శాతానికి పెంచారు.

**ప్రత్యక్షపన్ను:**
పన్ను భారాన్ని బదిలీ చేయడానికి వీలులేని పన్ను. ఉదాహరణకు ఆదాయ పన్ను, కార్పొరేట్ పన్ను, వృత్తి పన్ను, సంపదపన్ను, వ్యయపన్ను మొదలైనవి.

**పరోక్ష పన్ను:**
పన్ను భారాన్ని బదిలీ చేసే అవకాశం గల పన్ను. ఉదాహరణకు ఎక్సైజ్ సుంకం, కస్టమ్స్ (దిగుమతి, ఎగుమతి) సుంకాలు, అమ్మకం పన్ను, వ్యాట్, సర్వీసు పన్ను మొదలైనవి.

**లోటు భావనలు**

**బడ్జెట్ లోటు:** మొత్తం వ్యయం నుంచి మొత్తం వసూళ్లను తీసివేయగా వచ్చేది.
**రెవిన్యూ లోటు:** రెవిన్యూ వ్యయం నుంచి రెవిన్యూ వసూళ్లను తీసివేయగా వచ్చేది.
**విత్త లోటు:** మొత్తం వ్యయం నుంచి రుణేతర వసూళ్లను తీసివేయగా వచ్చేది.
**ప్రాథమిక లోటు:** విత్త లోటు నుంచి వడ్డీ చెల్లింపులను తీసివేయగా వచ్చేది.
విత్త సంస్కరణల్లో భాగంగానే బడ్జెట్ లోటు స్థానంలో విత్తలోటును చూపుతున్నారు. బడ్జెట్ లోటుకు మార్కెట్ రుణాలను, చిన్న పొదుపు మొత్తాలను, ప్రావిడెంట్ ఫండ్ వసూళ్లను కలపగా విత్తలోటు వస్తుంది .